హైదరాబాద్ వార్త



# బిఎల్ఓలకు సమస్యగా మారిన ఓటర్ల చిరునామా

*** ఇంటింటికి తిరిగినా లభించని ఓటర్ల వివరాలు * లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్న బిఎల్ఓలు**



**హైదరాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో అధికారులు రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత స్థాయి అధికారుల ఒత్తిడి, ఓటర్ల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకత కారణంగా బిఎల్ఓల తిప్పలు అన్నీ ఇన్నీకావు. ఓటర్‌లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం మొదలు, ఓటర్‌లు పూరించిన తరువాత వాటిని స్వీకరించడంలాంటి ప్రక్రియతో బిఎల్ఓలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికి వెళ్లడం, ఎన్యూమరేషన్ ఫారాలను అందించడంలాంటి అటు తరువాత జరిపే విధుల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కొందరు బిఎల్ఓలు విధులకు హాజరు కాలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఎన్యుమరేషన్ ఫారం ఇచ్చేందుకు వెళ్తున్న ఒక్కో బీఎల్ఓకు ఒక్కో విధమైన అనుభవం ఎదురవుతోంది. తమకిచ్చిన కిట్‌తో పాటు ఎన్యూమరేషన్ పత్రాల కట్టలను మోసుకుని ఇంటింటికీ తిరగలేకపోతున్నారు. ఇంటింటికి తిరుగుతున్నప్పటికి ఓటర్ల చిరునామాలు దొరకక, స్థానికంగా సహకారం లభించక అవస్థలు పడుతున్నారు. ఎలాగోలా చిరునామ పట్టుకొని ఓటర్‌ల నివాసాలకు వెళితే తాళంవేసి ఉంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకటికి నాలుగుసార్లు నివాసాలకు వెళ్లడంతో లక్ష్యం చేరుకోవడం సాధ్యం కావడం లేదని బిఎల్ఓలు చెబుతున్నారు. ఓటర్‌లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందచేసిన నాలుగైదు రోజుల తరువాత వారి నివాసాలకు వెళితే ఇంకా పూరించలేదని కొందరు, అర్థం కావడం లేదని మరి కొందరు సమాధానం చెబుతున్నారు. మరి కొందరైతే 2002 నాటి ఓటర్ జాబితా ఎక్కడి నుంచి తేవాలని మండిపడుతున్నారు. చిరునామాల మార్పులు, ప్రజల సహకారం లేకపోవడం వల్ల ప్రక్రియ నత్తనడకన సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చాలా మందికి అప్పటి ఓటరు వివరాలు గుర్తులేకపోవడం, ఏ నియోజకవర్గంలో ఓటు ఉందో తెలియకపోవడంవల్ల ఫారాలు పూర్తిచేయలేకపోతున్నారు. బీఎల్ఎలవద్దకు క్యూఫారాలు ఎలా నింపాలో తెలియక చాలా మంది బీఎల్ఓల వద్దకు వచ్చి సాయం కోరుతున్నారు. ఈ క్రమంలో వారికి ఒక్కోఫారం నింపేందుకు సమయం పడుతుండటంతో ఇతర పనులు ఆలస్యమవుతున్నాయి. గతంలో నమోదైన చిరునామాల్లో ప్రస్తుతం చాలా మంది నివసించడంలేదు. ముఖ్యంగా ఉద్యోగాలు, ఇతర కారణాలతో వేలాదిమంది ప్రాంతాలు మార్చేశారు. ఇళ్లకువెళ్లిన బీఎల్ఎలకు మేము ఇక్కడ ఉండడం లేదు అనే సమాధానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి.

**సహకరించని ఓటర్లు...**

పంపిణీ చేసిన ఫారాలు తిరిగి తీసుకురావడానికి వెళ్లిన బీఎల్ఓలకు కొందరు ఓటర్లు సహకరించడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. దాదాపు 10 నుంచి 15 కిలోల బరువు మోసుకుంటూ నడుస్తుండడంతో నీరసించిపోతున్నారు. రోజంతా ఇంటింటికి తిరుగుతూ ఫారాలు అందజేయడానికి ప్రయత్నిస్తే కేవలం కొంతమేరకే ఫలితం ఉంటుందని బీఎల్ఓలు చెబుతున్నారు.

**సమస్యగా మారిన 2002 ఓటరు జాబితా వివరాలు...**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో 2002 నాటి ఓటరు జాబితా సమస్యగా మారింది. ఎక్కువగా విద్యావంతులు కాకపోవడం, 2002 సంవత్సరంలో ఎక్కడ నివాసం ఉండిందో తెలపడంలో ఓటర్లు తికమకపడుతున్నారు. అప్పట్లో ఇంటింటికి వచ్చి అధికారులే తమ పేర్లు ఓటర్ జాబితా కోసం రాసుకుపోయారని, అప్పుడు ఓట్లు వచ్చాయో, రాలేదో తెలువదని ఓటర్లు చెబుతున్నారు. 2002 నాటి ఎపిక్ కార్డుల నెంబర్‌లు సేకరించడం ఓటర్‌లకు ఇబ్బందికరంగా మారింది. బిఎల్ఓలు ప్రతీ ఓటరుకు చెందిన 2002 నాటి ఓటరు జాబితాను గుర్తించడంకోసం ఎంతో సమయం కేటాయించాల్సి రావడంతో అధికారులు ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడం సాధ్యపడడం లేదని బిఎల్ఓలు ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో పోలింగ్ బూత్ నెంబర్‌లు, నియోజకవర్గం నెంబర్‌లు మారడంతో ఓటర్‌లు వాటిని గుర్తించడం తేలిక కావడంలేదు. గ్రేటర్‌లో ఎక్కువ శాతం ఉద్యోగాలు, వ్యాపారాలు, రోజువారి కూలీలు, ఇతర వ్యాపకాల కారణంగా ఉదయం నుంచి సాయంత్రం, రాత్రి వరకు నివాసాల వద్ద లేకపోవడంతో ఇళ్లకు తాళాలు దర్శనమిస్తున్నాయి. ఓటర్‌లను చేరుకొని, వారికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, వాటిని పూరించిన తరువాత తిరిగి సేకరించడం బిఎల్ఓలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారిది. ఉన్నతస్థాయి అధికారుల వత్తిడి, ఓటర్ల నిర్లక్ష్యమో, లేక ఇతర కారణాలేమైనా బిఎల్ఓల పరిస్థితి మాత్రం నరక ప్రాయంగా మారిందంటున్నారు. ఎన్యూమరేషన్ ఫారంలో 2002లో ఓటు ఎక్కడ నమోదైందనే వివరాలు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉండడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామందికి అప్పటి ఓటరు వివరాలు గుర్తులేకపోవడం, ఏ నియోజకవర్గంలో ఓటు ఉందో తెలియక పోవడంవల్ల ఫారాలు పూర్తిచేయలేకపోతున్నారు. ఒక్కొక్క ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా పూరించాలో తెలియజేయడం ఎంతో సమయంతో కూడుకున్నదని, ఇచ్చిన టార్గెట్ చేరుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి బిఎల్ఓలు చెరబుతున్నారు. చివరి రోజుల్లో అన్ని ఫారాలు ఒకేసారి వస్తే వాటిని ఆన్లైన్లో నమోదు చేయడం కష్టతరమవుతోందని పలువురు బీఎల్ఎలు ఆందోళన చెందుతున్నారు.

# ఉప్పల్ స్టేడియంలో టీజీ 20 క్రికెట్ లీగ్ సందడి!

**సందడి చేసిన సినీ నటుడు విజయ్ దేవరకొండ.. రాహుల్ సిప్లిగంజ్ మ్యూజిక్... బతుకమ్మ, బోనాలు, కోలాటం**







**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో టీజీ-20 క్రికెట్ లీగ్‌మ్యాచ్‌తో సందడి నెలకొంది. స్టేడియంలో కొద్ది రోజులుగా జరుగుతున్న టీజీ-20 క్రికెట్ లీగ్‌మ్యాచ్‌లు ఆదివారంతో ముగియనున్నాయి. ఆదివారం హైదరాబాద్ ఈచాంపియన్స్, ఖమ్మం ఏసెస్ మధ్య టీజీ 20 లీగ్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. టీజీ20 లీగ్ దశలో ఏడుకు ఏడు విజయాలతో మిగతా జట్లకు అందనంత ఎత్తులో నిలిచింది హైదరాబాద్ ఈ ఛాంపియన్స్. అలాంటి జట్టును క్వాలిఫయర్ 1లో ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచింది ఖమ్మం ఏసెస్. అయితే తొలి క్వాలిఫయర్‌లో అనూహ్యంగా ఓడినప్పటికీ.. కరీంనగర్ డైమండ్స్ రెండో క్వాలిఫయర్‌లో చెలరేగి ఆడిన హైదరాబాద్ అలవోకగా ఫైనల్ చేరింది. లీగ్ దశలో టాప్2లో నిలిచిన జట్ల మధ్యే ఫైనల్ జరుగుతుండడంతో స్టేడియంలో ప్రేక్షకుల సందడి వాతావరణం నెలకొంది. సినీనటుడు టీజీ 20 లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ, టీజీలీగ్ ప్రతినిధులు, హెచ్‌సిఏ ప్రతినిధులు కలిసి స్టేడియంలో గంట మోగించి మ్యాచ్‌ను ప్రారంభించారు.

**భారీగా తరలివచ్చిన ప్రేక్షకులు :**

ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్ ఈ చాంపియన్స్, ఖమ్మం ఏసెస్ మధ్య టీజీ20 లీగ్ ఫైనల్ మ్యాచ్ జరుగుతుండడంతో భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. స్టేడియంలో టిక్కెట్ ఉన్న వారినే లోపలికి అనుమతించారు. స్టేడియంలో పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేడియం చుట్టూ ప్రత్యేకంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర గవర్నర్‌తోపాటు, సిఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని ప్రచారం జరగడంతో స్టేడియంవద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మ్యాచ్ టిక్కెట్లు ఆన్‌లైన్‌తో పాటు, కాంప్లమెంటరీ భారీగా పంపిణీ చేశారు. విఐపిలు, రాజకీయపార్టీల నేతలు టిక్కెట్లు తీసుకుని అనుయాయులకు ఇచ్చారు. పోలీసులు పలు వరికి మ్యాచ్ టిక్కెట్లు పంచినట్లు సమాచారం.



నిందితులను అరెస్ట్ చేసిన ఉప్పల్ పోలీసులు

## బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఇద్దరిని ఉప్పల్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డిఐ రవికుమార్ కథనం ప్రకారం.. ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన సోమ అజయ్ హోండా ఎస్పీ షైన్ మోటార్ సైకిల్ గత నవంబర్ 3వ తేదీన రాత్రి 10 గంటలకు గది ముందు పార్క్‌చేసి నిద్రపోయానని, మరుసటిరోజు బయటకు వచ్చి చూడగా మోటార్ సైకిల్ కనిపించలేదని తెలిపాడు. దీనిపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ఇదే క్రమంలో శనివారం మధ్యాహ్నం ఉప్పల్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో, అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో విచారణ చేయగా నిందితులు మోహిదీపట్నంకు చెందిన షేక్ అవైజ్ (20), మరో నిందితుడు మొహమ్మద్ ఫర్హాన్ ఖురేషి, (21) పలు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ.4,00,000/ విలువ గల ఆరు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## క్రేన్ వైర్ తెగి పడి కార్మికుడు దుర్మణం

**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** ఉప్పల్ పారిశ్రామికవాడలో క్రేన్ వైర్ వైర్ తెగి కార్మికుడిపై పడడంతో తీవ్ర గాయాలకుగురై మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సన్నీ(20) అనే వ్యక్తి ఉప్పల్ పారిశ్రామికవాడ లక్ష్మినారాయణకాలనీలోని సుప్రీం లేజర్ కట్టింగ్, ఇంజనీరింగ్ వర్క్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయితే శనివారం సాయంత్రం కంపెనీలో పనిచేస్తుండగా క్రేన్ వైర్‌తో భారీ వస్తువులు పైకి లేపగా, సన్నీ ప్రమాదవశాత్తు దాని కింద ఉండిపోయాడు. ఇదే క్రమంలో ప్రమాదవశాత్తు క్రేన్ వైర్ తెగి పడిపోవడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కార్మికుడి కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం అందిస్తామని కంపెనీ యజమాన్యం హామీ ఇచ్చారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లి పేరుతో ఒకరు.. పెళ్లి కాలేదని మరొకరు

**- పంజాగుట్ట ఠాణాలో వేర్వేరు ఘటనల్లో యువతుల ఫిర్యాదు**

**జూబ్లీహిల్స్, జూలై 12, ప్రభాతవార్త :** పెళ్లి పేరుతో ఒకరు మోసం చేస్తే.. పెళ్లి కాలేదని మరొకరు మోసం చేసిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేటకు చెందిన ఒక యువతి(26) సాయికిరణ్ అనే వ్యక్తితో ఏడాదిన్నరగా ప్రేమలో ఉంది. ఇద్దరు కలిసి బేగంపేట ప్రాంతంలో సహజీవనం చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు ముఖం చాటేయడంతో యువతి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**మరో సంఘటనలో...**

ఇన్‌స్టాలో ఒక యువతికి మారంపూడి రమేష్ తేజ పరిచయమయ్యాడు. అతనికి పెళ్లైన విషయాన్ని దాచి ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. పంజాగుట్టలోని ఒక హోటల్‌లో ఇద్దరు ఏకాంతంగా గడిపారు. యువతి రమేష్ తేజ గురించి ఆరా తీయగా నాలుగేళ్ల క్రితమేపెళ్లైందని గుర్తించింది. తనను మోసం చేశాడంటూ యువతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి హత్య

**వనస్థలిపురం, జూలై, 12, ప్రభాతవార్త:** గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైన సంఘటన వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వనస్థలిపురం, పనామా చౌరస్తా సమీపంలోని ఎస్ఎస్‌వివీలకేర్ షెట్టర్ పక్కన ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల ద్వారా ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి రక్తపుమడుగులో పడిఉండడం గమనించారు. అతడి వయస్సు 55 సంవత్సరాలు ఉండి, 5.5 అడుగుల ఎత్తు, చామన ఛాయా రంగులో, తెల్లటి గడ్డంతో, తెల్లటి దుస్తులు ధరించి ఉన్నాడని తెలిపారు. తలకు వెనుకవైపు గాయాలున్నాయని గమనించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదుచేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇది హత్యా లేదా అనుమానాస్పద మృతా అనేకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అంబర్‌పేటలో కిషన్‌రెడ్డి పాదయాత్ర

**ఆప్యాయంగా పలకరింపు.. ఇళ్లపై నుంచి కురిసిన పూలవర్షం**



అంబర్‌పేట నియోజకవర్గంలో పాతయాత్ర నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ జూలై 12 ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం కాచిగూడ డివిజన్‌లో అడుగుపెట్టిన ఆయనకు కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. మహిళలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనడంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, అభివాదం చేస్తూ కిషన్ రెడ్డి ముందుకు సాగుతుండగా, స్థానిక మహిళలు ఇళ్లపై నుండి పూలవర్షం కురిపిస్తూ ఆయనపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజలతో మమేకమవుతూ కొనసాగిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాదయాత్ర అత్యంత ఉత్సాహంగా కొనసాగుతోంది.

పాదయాత్రలో భాగంగా దారిలో ఉన్న ఒక స్థానిక టిఫిన్ సెంటర్ వద్ద ఆగిన ఆయన, అక్కడ టీ తాగుతూ స్థానికులతో కాసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఒక సామాన్యుడిలా టీ కోసం ఫోన్‌పే ద్వారా స్వయంగా డబ్బులు చెల్లించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రజలతో ఆయన మమేకమవుతున్న తీరు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, "సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రతి శనివారం, ఆదివారం బస్తీలలో పర్యటించే కార్యక్రమాన్ని చేపట్టాను. ఇందులో భాగంగా ఈరోజు అంబర్ పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలోని బస్తీలను సందర్శించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నాను. నాతోపాటు ప్రభుత్వ అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు.

వర్షాకాలం ప్రారంభమైన తర్వాత చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. వీధిలైట్లు వెలగక బస్తీలు అంధకారంలో ఉన్నాయి. ఈ సమస్యపై అధికారులకు సమాచారం ఇచ్చినా, పాడైపోయిన లైట్లను మార్చడంలో జాప్యం జరుగుతోంది. వర్షాకాలం వస్తున్నా, వేసవి కాలంలో మాదిరిగానే ఇప్పటికీ చివరి బస్తీలకు, ఇళ్లకు తాగునీరు అందడంలేదు. ప్రజలు నీటి ఎద్దడిపై తీవ్ర ఆక్రోశంతో ఉన్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి. బస్తీలలో ప్రజలు ఇళ్లు, పెన్షన్ల కోసం డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను ఆశ చూపి మోసం చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు కావస్తున్నా, అర్హులైనవారికి పెన్షన్లు అందడం లేదని, అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితంలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సహాయం, నిరుద్యోగ యువతకు రూ. 4000 భృతి, అమ్మాయిలకు స్కూటీలు, వివాహ సమయంలో తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వలె, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం హైటెక్ సిటీని మాత్రమే అభివృద్ధిగా భావిస్తోంది. సికింద్రాబాద్, అంబర్‌పేట్, సనత్‌నగర్, గౌలిగూడ, ఓల్డ్‌సిటీ, ఖైరతాబాద్‌వంటి ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు" అన్నారు. కాగ, గోల్నాక డివిజన్‌లో కొనసాగిన కిషన్ రెడ్డి పాదయాత్రలో పారిశుధ్య కార్మికులతో కలిసి స్వయంగా వీధుల శుభ్రం చేశారు.

## బ్రాహ్మణ సమాజ శ్రేయస్సుకు సామాజిక వేదికలు అవసరం

**- ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్‌రావు**

**నాచారం, జూలై 12 ప్రభాతవార్త :** బ్రాహ్మణ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు సనాతన ధర్మ సంప్రదాయాల పరిరక్షణకు, యువతకు వివాహ పరిచయ వేదికలను కల్పించేందుకు నిర్వహించే సామాజిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్స్) హార్కర వేణుగోపాల్‌రావు అన్నారు. ఆదివాకం హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వశిష్ట కల్యాణ వేదిక, రజతోత్సవ వేడుకలు, బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతి వర్గం అభ్యున్నతికి పరస్పర సహకారం, సామాజిక బాధ్యత అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి వేదికలు యువతకు సత్సంబంధాలు ఏర్పడేందుకు, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ, బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర, జిల్లాస్థాయి బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ప్రతినిధులు, వేదపండితులు, పండితులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణ కుటుంబాలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొమురవెల్లికి రైలు సౌకర్యం..26న ప్రారంభం

**తార్నాక, జూలై 12 ప్రభాతవార్త :** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోమురవెల్లికి రైల్వే అనుసంధానం కల్పించే దిశగా కీలక అడుగు పడింది. కోమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ఈ నెల 26న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవం అనంతరం తొలి రైలును జెండా ఊపి ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. కేంద్రప్రభుత్వం రైల్వే విస్తరణలో భాగంగా నిర్మించిన ఈ స్టేషన్‌తో కోమురవెల్లి ఆలయానికి వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం మరింత చేరువ కానుంది. రైల్వేస్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలు, విశాలమైన ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ మందిరాలు, తాగునీటి వసతి, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. కోమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభంతో సిద్దిపేట ప్రాంత అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు పర్యాటక, ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపు లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




కొమురవెల్లి రైల్వే స్టేషన్

# డ్రైబోరింగ్‌ల చుట్టూ ఇంకుడు గుంతలు

**- కొన్ని చోట్ల నిలిచిన పనులు**

**- రోడ్లపై జీహెచ్ఎంసి పిట్స్**



శివగంగానగర్‌లో డ్రై హ్యాండ్‌పంప్ చుట్టూ ఇంకుడు గుంత కోసం తవ్వి వేదిలేసిన దృశ్యం

**చాంద్రాయణగుట్ట, జూలై 12, ప్రభాతవార్త :**

కాంక్రీట్ జంగల్ లాంటి మహానగరంలో భూగర్భ జలాలు క్రమేణ అడుగంటిపోతున్నాయి. మంచినీటి కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే ఏ ఇంట్లో చోసిన వందల అడుగల లోతు వరకు బోరింగులు వేసి పుడమి తల్లికి జల్లెడలా తూట్లు పొడిచేస్తున్నారు. కరెంటు మోటార్లతో నీటిని తోడేస్తున్నారు. కొందరు నీటి వ్యాపారాలు చేస్తున్నారు. రానురాను బోరింగులు పనిచేయక మున్సిపల్ (జలమండలి) వాటరే దిక్కు కానుంది. వర్షాకాలంలో కురిసే వర్షాలతోవచ్చే వరద రోడ్లపై వృధాగాపారుతూ నాలాలు, కచ్చామోరీలలో కలుస్తుంది. చివరకు మూసిలోకి చేరుతున్నాయి. విలువైన నీరు ఎందుకు పనికి రాకుండా పోతుంది. ఎలినినో కారణంగా ఈఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షం జాడే కనిపించటం లేదు. గత నెలలో కురిసిన రెండు మూడు వర్షాలు తప్పా ఈ నెలలో ఇంతవరకు వర్షం కురిసిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో వర్షపు నీటిని వడిసి పట్టాలన్న ఉద్దేశంతో జలమండలి వినూత్న కార్యచరణతో ముందుకు వెళుతుంది. కాలనీలు, అపార్ట్‌మెంట్ల కొత్త నిర్మాణాలకు ఇంకుడు గుంతలు తప్పని సరిచేసింది. అంతే కాకుండా హ్యాండ్ పంప్స్, డ్రై బోర్‌వెల్స్ (వట్టిపోయిన చేతి పంపులు, బోరింగులు) వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. వీటిపై జనరల్ మేనేజర్ (జిఎం-10) కె.భాస్కర్ ప్రత్యేకంగా నజర్ వేశారు. ఇక జలమండలి, జీహెచ్ ఎంసిలు చేపట్టిన ఇంకుడు గుంతల ఏర్పాటుతో భవిష్యత్‌లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది.

**డ్రైబోర్స్ చుట్టూ ఇంకుడు గుంతలు**

జలమండలి రాజేంద్రనగర్ జోన్, జిఎం-10లోని జంగమ్మెట్, ఫలక్‌నుమా సర్కిళ్ళలో 53 ఇంకుడు గుంతలు (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) మంజూరయ్యాయి. పూల్‌బాగ్, శాలిబండ, జంగమ్మెట్ వార్డులలో 40 ఇంకుడు గుంతల నిర్మాణం జరుగుతుంది. వీటి పర్యవేక్షణ బాధ్యతలను శాలిబండ వార్డు మేనేజర్ నజీర్‌కు అప్పగించారు. దాదాపు 50 శాతం గుంతలు పూర్తిచేశారు. మిగిలిన వాటి పనులు జరుగుతున్నాయి. అయితే సంబంధిత కాంట్రాక్టర్ కొన్ని బోరింగుల వద్ద గుంతలు తీసి వదిలేశాడు. ఉదాహరణకు శివగంగానగర్‌లోని పనిచేయని చేతి పంపు చుట్టూ ఇంకుడుగుంతకోసం గోయి తీసిశాడు. కొన్ని రోజులుగా ఆ గోయి మురికి కూపంలా తయారైయింది. చెత్తా చెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు వేశారు. దోమలు వృద్ధి చెందుతున్నాయి. బస్తీ మధ్యలో ఉండటం వల్ల ప్రమాదకరంగా మారింది. పలు చోట్ల నిలిచిపోయిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉంది. జలమండలి ఉన్నతాధికారులు దూర దృష్టితో తీసుకున్న ఇంకుడు గుంతల(డ్రైబోరింగ్) నిర్మాణంతో ఆ ప్రాంతంలో పారే వర్షం నీరు కొంతైన వాటిలోకి చేరి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. ఇళ్ళలోని బోరింగులలో నీరు పైకి చేరి ఆ ఇంటి అవసరాలు తీరనున్నాయి.

**రోడ్లపై జీహెచ్ఎంసి పిట్స్**

జీహెచ్‌ఎంసి సంతోష్‌నగర్ సర్కిల్ పరిధిలో 68 ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా వాటి పనులు చేపట్టారు. గౌలిపురా డివిజన్‌లోని గౌలిపురా గాంధీ విగ్రహం నుండి దర్వాజా వైపు వెళ్ళేదారిలో రోడ్డుకు ఇరువైపుల రెండు చొప్పున నాల్గు ఇంకుడు గుంతల నిర్మాణం జరుగుతుంది. బాక్స్ డ్రైన్ మ్యాన్‌హోళ్లు నిర్మిస్తున్నారు. వర్షాకాలంలో వర్షం నీరు వృధాగా రోడ్లపై పారకుండా వీటిలోకి వెళ్లేలా చేస్తున్నారు. జీహెచ్ ఎంసి చేపట్టిన ఇంకుడుగుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని ఆ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ) యాదగిరి తెలిపారు.

## మద్యం మత్తులో తల్లిదండ్రుల గొడవ

**మనస్థాపంతో కుమారుడు ఆత్మహత్య**

**గచ్చిబౌలి, జూలై 12 ప్రభాతవార్త :** మద్యం తాగి ఇంటికి వచ్చిన తండ్రితో తల్లి గొడవపడడం, గొడవపెట్టుకుంటున్న తల్లిదండ్రులను సముదాయించేందుకు ప్రయత్నించిన కుమారుడిని తండ్రి తిట్టడంతో మనస్థాపానికి గురైన కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని గచ్చిబౌలిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలి పరిధిలోని రాజీవ్‌నగర్ వడ్డెరబస్తీలో కుటుంబంతో జి.ఎల్లయ్య తన భార్య, కుమార్తె, కుమారుడు మోహన్(15)తో కలిసి నివాసం ఉంటున్నాడు. ఎల్లయ్య స్థానికంగా లేబర్‌గా పనిచేస్తుండగా, ఇతని కుమారుడు గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా శనివారం రాత్రి ఎల్లయ్య మద్యం తాగి మత్తులో ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో రోజు మద్యం తాగి వస్తున్నావంటూ అతని భార్య నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇద్దరు గొడవ పడుతుండడంతో అక్కడే ఉన్న కుమారుడు మోహన్ మధ్యలో వచ్చి గొడవ పడవద్దని కోరాడు. దీంతో ఎందుకు మధ్యలోకి వస్తున్నావంటూ ఎల్లయ్య కుమారుడిని తీవ్ర పదజాలంతో దూషించాడు. దీంతో మీరు ఇక మారరు అని తల్లిదండ్రులకు చెప్పి అక్కడి నుంచి బయటకు వచ్చిన మోహన్ రాజీవ్‌నగర్‌లోనే ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లి రేకుల షెడ్డులో సీలింగ్‌కు ఉన్న ఇనుప రాడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడిని వెతుకుతూ వెళ్లిన కుటుంబ సభ్యులకు మోహన్ సీలింగ్‌కు వేళాడుతూ కనిపించడంతో వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఈమేరకు సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు మోహన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

## శ్రీలక్ష్మీదుర్గ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**సంజీవరెడ్డినగర్, జూలై 12, ప్రభాతవార్త:** అమీర్‌పేటలోని శ్రీలక్ష్మీదుర్గ సోనబాయమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌ను శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్నందుకు నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, గులాబ్ సింగ్, గోపీలాల్ చౌహన్, గోసుల సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.

**నల్లపోచమ్మ ఆలయంలో...**

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** మోండా డివిజన్ ఆదయ్య నగర్‌లోని శ్రీనల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన కుంభాభిషేకం పూజలకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గంట సంజయ్, సందీప్, సతీష్, రాములు, ప్రమోద్, దేవానంద్, రజనీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదును వేగవంతం చేయాలి

### జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్


ఓటరు నమోదును పరిశీలిస్తున్న జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్

**కార్వాన్, జూలై 12(ప్రభాతవార్త):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ నగరంలో క్షేత్రస్థాయి పర్యటనలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఓటరు నమోదు ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గుడిమల్కాపూర్ డివిజన్‌లో కమిషనర్ కర్ణన్ ఆయనతోపాటు బిజెపి గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ ఆకస్మిక పర్యటనలో పాల్గొని, పలు ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించి,నమోదు వివరాలను బీఎల్ఓ, బిఎల్ఏలను అడిగి తెలుసుకొని, ఓటరు నమోదు ప్రక్రియ డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలన్నారు.

## సైకాలజిస్టులు ప్రజలకు మానసిక ఆరోగ్యాన్ని అందించాలి

### సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్



మాట్లాడుతున్న మోతుకూరి రాంచందర్

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** ప్రస్తుతం సమాజంలో సైకాలజిస్టుల అవసరం రోజురోజుకు పెరిగిపోతుందని, అదే విధంగా వారు వృత్తిపరమైన నైపుణాలను పెంపొందిచుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ సూచించారు. సైకాలజిస్టులందరూ ఒకే వేదికపైకి ఐక్యంగావచ్చి హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన గుర్తింపు ప్రజలకు నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే తెలంగాణ సైకాలజిస్టు కౌన్సిల్ ఏర్పాటు కోసం కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన రాష్ట్ర, జిల్లాల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి సైకాలజిస్టుల ఈ తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్‌కు మద్దతు పలకాలని, ఐక్యతతో పనిచేసినప్పుడే సంస్థ లక్ష్యాలు సాకారం అవుతాయని, సైకాలజిస్టుల సంక్షేమానికి వృత్తి పురోగతి బలమైనదన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డా.శ్రీపూజా, ఏ.సుధాకర్, అలియా పర్విన్, క్రిష్ట సాహితి, సునయన, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణకు జిమ్ అవసరం : ఎమ్మెల్యే శ్రీగణేష్


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** శారీరక దృఢత్వం,ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు.ఎమ్మెల్యే నిధులతో ఆదివారం 5వ వార్డు మహేంద్రహిల్స్ రవికాలనీలోని పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. నేటి యాంత్రిక జీవనంలో ఒత్తిడిని అధిగమించడానికి సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం(జిమ్) ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో రవి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ రావ్,రవికాంత్,రఘునాథ్, మహేందర్, కాంగ్రెస్ నేతలు పెద్దాల నర్సింహ్మ,సంకి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

## కవితక్కను సిఎం చేయటమే టిఆర్ఎస్ లక్ష్యం

**చాంద్రాయణగుట్ట, జైలై 12, ప్రభాతవార్త :**కవితక్కను సీఎం చేయటమే లక్ష్యంగా కృషిచేస్తామని టిఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజక వర్గ ఇంచార్జ్ పుప్పాల రాధాకృష్ణ అన్నారు. తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలో భాగంగా ఆదివారం లాల్‌దర్వాజా మోడ్ వద్ద ముఖ్యనేతలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పనులను ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నేతలు రూప్‌సింగ్, జిల్లా నేత మహేందర్‌ముదిరాజ్, మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మనోజగౌడ్, యాకుత్‌పురా పరిశీలకులు జ్యోతికులకర్ణి, మీనాచౌహాన్, డివిజన్ అధ్యక్షులు ఫంకజ్‌షిండే పాల్గొన్నారు. పలువురు బిజెపి నేతలు టీఆర్ఎస్‌లో చేరారు.

## 'భరతోదయము' మహాపద్యకావ్యం ఆవిష్కరణ

**జూబ్లీహిల్స్, జూలై 12, ప్రభాతవార్త:** ఆచార్య డా. దేవరాజు రాంభావు వ్యక్తిత్వం విజ్ఞాన శాస్త్రం, సాహిత్యాల అపూర్వ కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నవ్య సాహితీ సమితి ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఆచార్య డా. దేవరాజు రాంభావు రచించిన 770 పేజీల "భరతోదయము" మహాపద్యకావ్యం ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కె.వి. రమణ అధ్యక్షత వహించగా, మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ, విజ్ఞాన పరిశోధనల్లో మార్గదర్శకుడిగా నిలిచిన డాక్టర్ రాంభావు సాహిత్య రంగంలోనూ స్ఫూర్తిదాయకమైన రచనలు చేయడం అభినందనీయమన్నారు. తన గురువు మహాకవి వానమామలై వరదాచార్య ప్రేరణతో శకుంతల దుష్యంతుల ప్రణయ గాథను "భరతోదయం" పేరుతో బృహత్ పద్యకావ్యంగా రచించడం విశేషమని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రంథకర్త డా. దేవరాజు రాంభావు దంపతులను అతిథులు ఘనంగా సత్కరించారు. అలాగే ఆయన రచించిన గీతాలలో గీత, తొలకరి,రాగోదయం అనే మూడు పద్య కృతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సి. ప్రతాపరెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య, సాహితీవేత్తలు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, ఆచార్య వారిజారాణి, నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర పాల్గొని ఆవిష్కరించారు. నవ్య సాహితీ సమితి అమృతోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వేమరాజు విజయకుమార్ నిర్వహించగా, సి.కృష్ణ కన్నా రావు, పిఆర్ఓ బాలాజీశర్మతోపాటు పలవురు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, డా. రాంభావు శిష్యులు, మిత్రులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



డాక్టర్ దేవరాజు రాంభావు దంపతుల సన్మాన కార్యక్రమంలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కెవి రమణాచారి


సమావేశంలో పాల్గొన్న జ్ఞానేశ్వర్‌గౌడ్, దుర్గప్రసాద్‌రెడ్డి తదితరులు

## అంబర్‌పేటలో ఆగస్టు 9 బోనాల వేడుకలు

### 26న ఘటం ఊరేగింపు

**హైదరాబాద్, జూలై 12 ప్రభాతవార్త :** అంబర్‌పేట దేవస్థానం సేవా సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 9వ తేదీన బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. అందుకు భారీ ఏర్పాట్లపై ఆదివారం అంబర్‌పేట దేవస్థానం సేవా సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో దేవస్థానం సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ బోనాల వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆగస్టు 9న బోనాల ఉత్సవాలు ఘణంగా నిర్వహిస్తామని దేవస్థాన సేవా సమితి సభ్యులు తెలిపారు, అంబర్‌పేట దేవస్థానం సేవా సమితి ఎన్నికలు డిసెంబరు నెలలో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, కె.దుర్గప్రసాద్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై.శంకర్‌గౌడ్, పంజాల గిరిధర్‌గౌడ్, రంగంపల్లి రాజు,బింది మల్లికార్జున్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, చెంగలి సుధాకర్, దొమకొండ కిషోర్, మొర పాండుముదిరాజ్ పాల్గొన్నారు.

## ఉమ్రాకు వెలుతున్న ఎటిఒ మహ్మద్ షబ్బీర్‌కు సన్మానం


జలమండలి ఎటిఒ మహ్మద్ షబ్బీర్‌ను సన్మానిస్తున్న మేవా ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, జూలై 12, ప్రభాతవార్త :** పవిత్రమైన ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళుతున్న జలమండలి అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్(ఎటిఒ) మహ్మద్ షబ్బీర్‌ను ఆలియాబాద్ జలమండలి కార్యాలయంలో ముస్లీం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా), ఉద్యోగులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్తర్ అలీ, ఉద్యోగులు మహ్మద్ సలీమ్, మహ్మద్ మజర్, మహ్మద్ షకీల్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ జహంగీర్, మహ్మద్ యూసుఫ్ అలీ, సల్మాన్ ఖాన్ తదితరులు అతడు క్షేమంగా యాత్ర పూర్తి చేయాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా అక్తర్ అలీ, షబ్బీర్ మాట్లాడుతూ సౌది అరేబియాలోని మక్కా పవిత్రమైన నగరానికి చేసే(చిన్నయాత్ర) ఉమ్రా అత్యంత ఆధ్యాత్మికమైనదన్నారు. ఉమ్రాను యేడాదిలో ఏరోజైన దర్శించుకోవచ్చని తెలిపారు.

## సామాజిక స్పృహతో ఎదిగిన ప్రభంజన్ యాదవ్

### హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి జూలై 12(ప్రభాతవార్త) :** తెలంగాణ రాజకీయ, ప్రజా ఉద్యమాల్లో నిస్వార్థ సేవలు అందించిన బహుజన మేధావి ప్రొఫెసర్ ప్రభంజనం యాదవ్ అని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బహుజన మేధావి ప్రొఫెసర్ ప్రభంజనం యాదవ్ సంస్మరణ సభ తెలంగాణ జేపీసీ సమన్వయ కర్త డాక్టర్ ఎం.ఏ. షోయబ్ ఆధ్వర్యంలో గుజ్జ కృష్ణ కోలా జనార్దన్ అధ్యక్షతన జరిగింది. సభలో పాల్గొన్న బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రభంజన్ యాదవ్ విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహతో, విప్లవ భావజాలంతో ఎదిగారని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఢిల్లీ వేదికగా ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఐఏఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాన్ని సైతం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం తృణప్రాయంగా వదిలేసిన త్యాగధనుడని అభినందించారు. డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో జన్మించిన ప్రభంజన్ యాదవ్, నిరంతరం వెనుకబడిన వర్గాల (బీసీ) హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడారని స్మరించుకున్నారు. ఈ సభలో విశ్రాంత ఉన్నతాధికారులు జెబి రాజు, చిరంజీవులు, ప్రొఫెసర్ డాక్టర్ గూడ రేఖ ప్రభంజన్ యాదవ్, కుమారులు విశ్వామిత్ర ఆర్. ప్రభంజన్, సత్యశోధక ఆర్. ప్రభంజన్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు.


సుల్తాన్ షాహి శ్రీజగదాంబ దేవాలయం కమిటి కొత్త కార్యవర్గం

## శ్రీజగదాంబ దేవాలయం కమిటీ నూతన కార్యవర్గం

**చార్మినార్, జూలై 12 ప్రభాతవార్త :** పాతబస్తీ సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ దేవాలయం కమిటి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయం కమిటి చైర్మన్‌గా రాకేష్ తివారీ,సలహాదారులుగా రంజిత్ సింగ్, అతుల్ శుక్లా, అధ్యక్షులుగా ఎ.సుదర్శన్, ఉపాధ్యక్షులుగా ఎం.వరద రాజు, జె.శ్రీ రాములుచారి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్ తివారి, జాయంట్ సెక్రటరీగా ఎం.కృష్ణముదిరాజ్, కోశాధికారిగా ఎం.వేణు గోపాల్, కార్యవర్గ సభ్యులుగా శశాంక్‌తివారి, కె.నర్సింహ, వి.రాఘవేంద్ర, విక్రమ్‌సింగ్, గౌతమ్ పాండే, రామ్‌చందర్ పాండే, ఎం.సాయి కిరణ్‌లను ఎన్నుకోవటం జరిగిందని దేవాలయం కమిటీ నూతన చైర్మన్ రాకేష్‌తివారి తెలిపారు. ఎంతో వైభవంగా బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నామని, దేవాలయం నూతన కమిటి మూడు సంవత్సరాలుపాటు కొనసాగుతుందని ఆయన తెలియజేశారు.

## సుల్తాన్‌షాహి జగదాంబ దేవాలయ చైర్మన్‌గా రాకేష్ తివారి


శ్రీజగదాంబ దేవాలయం. ఇన్‌సెట్లో రాకేష్ తివారి

**చాంద్రాయణగుట్ట, జూలై 12, ప్రభాతవార్త :** పాతబస్తీలో చారిత్రక ప్రసిద్ధి గాంచిన సుల్తాన్‌షాహి శ్రీజగదాంబ దేవాలయ కమిటీ చైర్మన్‌గా రాకేష్ తివారి నియమితులయ్యారు. ఆదివారం ఆలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆషాఢమాస బోనాల పండుగకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారులుగా రంజిత్‌సింగ్, అతుల్ శుక్లా, అధ్యక్షులుగా ఎ.సుదర్శన్, ఉపాధ్యక్షులుగా ఎం.వరద రాజ్, జె.శ్రీరాములుచారి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్‌తివారి, జాయింట్ సెక్రెటరీగా ఎం.కృష్ణముదిరాజ్, కోశాధికారిగా ఎ.వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులుగా శశాంక్ తివారి, కె.నర్సింహా, వి.రాఘవేంద్ర, విక్రమ్‌సింగ్, గౌతమ్‌పాండే, రాంచందర్‌పాండే, ఎం.సాయికిరణ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ మూడు సంవత్సరాలు పదవిలో ఉంటుంది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షులు రాకేష్ తివారి మాట్లాడుతూ రానున్న బోనాల పండుగను నూతన కమిటీ, బస్తీవాసుల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు.

## చిక్కడపల్లి దేవాలయంలో హుండీ లెక్కింపు

**చిక్కడపల్లి, జూలై 12 (ప్రభాతవార్త) :** చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గడిచిన 107 రోజులకుగాను భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. ఈ ఏడాది మార్చి 24 నుండి జూలై 9 వరకు (మొత్తం 107 రోజులు) గాను దేవాలయానికి భారీగా ఆదాయం సమకూరింది. హుండీల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 25,18,143గా అధికారులు తేల్చారు. దేవాలయ వ్యవస్థాపక వంశీయులు జి. శ్రీనాథ్ గౌడ్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ , ఆలయం ఈఓ వి. సుశీల్ రెడ్డి , దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. సురేఖ సమక్షంలో లెక్కించారు. ఇందులో నోట్ల రూపంలో రూ. 23 లక్షల ,56 వేల 945 రాగా, నాణేల రూపంలో రూ. లక్ష 61 వేల 198 లభించాయి. నగదుతో పాటు భక్తులు తమ మొక్కుల రూపంలో విదేశీ కరెన్సీని కూడా సమర్పించారు. ఇందులో 2,012 యూఎస్ డాలర్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆలయ సిబ్బంది మరియు భక్తులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు. వీరికి చిక్కడపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ అధికారులు, సిబ్బంది హుండీ నగదు లెక్కింపులో పూర్తి సహకారాన్ని అందించారు.


చిక్కడపల్లి దేవాలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం


జెబిఎస్ పికెట్ గార్డెన్‌లో సమావేశమైన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

### తెలంగాణ ఉద్యమకారులుగా

## ఆర్టీసీ ఉద్యోగులను గుర్తించాలి

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులు విధులు బహిష్కరించి పోరాటం చేసిన ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడందని, ఆ సమయంలో విధులను బహిష్కరించిన ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని, 2017,2021లో ఉద్యోగులకు రావాల్సిన వేతన సవరణ బకాయిలను తక్షణమే చెల్లించేందుకు ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగులంతా కలిసి కట్టుగా ఉద్యమించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.కిషోర్ కుమార్, కోశాధికారి కె.దుర్గయ్యలు పిలుపునిచ్చారు. ఆదివారం సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలోని పికెట్‌గార్డెన్‌లో నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సన బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. తమ హక్కుల సాధనకోసం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు సుజాత, ఉషారాణి, బిష్మా, రమేష్, ఎం.నాగరాజు,సూర్యప్రసాద్, సాంబశివరావ్ పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ జెండావిష్కరణ



ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేస్తున్న మల్లికార్జున్‌మాదిగ తదితరులు

**అడ్డగుట్ట, జూలై 12 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ చేపట్టిన ఉద్యమంతోనే ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి దప్పు మల్లికార్జున్ మాదిగ,జిల్లా నాయకులు చెండేటి వేణుగోపాల్ మాదిగలు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు మాచెర్ల కొండయ్య, జోగు దశరత, భూపతి సుజాత మాదిగ, పరశరాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో సినీతారల సందడి


కార్యక్రమంలో పాల్గొన్న శ్రీయాశరణ్, నవదీప్

**జూబ్లీహిల్స్, జూలై 12, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఫెస్టిగోవ్ డిజైనర్ స్టూడియోలో సినీనటులు సందడి చేశారు. నటులు శ్రీయాశరణ్, మంచు లక్ష్మి, నవదీప్ పాల్గొని భారతీయ లగ్జరీ చేనేత, కౌట్యూర్‌లను విష్కరించారు. అమెరికాలో పేరుగాంచిన ఈ ఫెస్టిగోవ్ అమెరికా వెలుపల ఏర్పాటుచేసిన తొలిస్టోర్‌గా గుర్తింపు పొందింది. కార్యక్రమంలో నిర్వాహకులు భావన ధనేకుల, సింధు కొసరాజు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**నిజాంపేట్, జూలై 12, ప్రభాతవార్త :** చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల కారణంగా నేడు(సోమవారం) నిజాంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్(ఏఈ) తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11 కేవీ బండారి లేఅవుట్ ఫీడర్, 11 కేవీ రాజధాని ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 11 కేవీ భవ్యాస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాల్లో నిజాంపేట్ గ్రామం, గ్రామపంచాయతీ పరిధి, రెడ్డీస్ అవెన్యూ, కుమ్మరి బస్తీ, సాయిబాబా కాలనీ, రేష్మా ఆసుపత్రి పరిసరాలు, నిజాంపేట్ ప్రధాన రహదారి, రత్నదీప్, పాలంపల్లి విల్లాస్, గ్రీన్ అవెన్యూ, బాలాజీ వెస్ట్ కౌంటీ, బాలాజీ పార్క్ టౌన్, బండారి లేఅవుట్, జర్నలిస్టు కాలనీ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సంబంధిత పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని, విద్యుత్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నిజాంపేట్‌లో మల్టీపర్పస్ హాల్‌కు భూమి పూజ

**నిజాంపేట్, జూలై 12, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ 2బిహెచ్‌కె డిగ్నిటీ గృహాల సముదాయంలో మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.45 లక్షల నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయని 2బి.హెచ్.కె హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా హౌసింగ్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ హాల్ నిర్మాణ స్థలంలో భూమి పూజ నిర్వహించారు. ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన కొలన్ హన్మంత్ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సొసైటీ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి, కాలనీ అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ 2బి.హెచ్.కె లబ్ధిదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషకరమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలతోపాటు కాలనీల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కుత్బుల్లాపూర్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2బి.హెచ్.కె హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** బషీర్‌బాగ్‌లోని ఎల్‌బి స్టేడియం ప్రాంగణంలో శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్ధనలు చేసినట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలు సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్రను పోషిస్తాయని, ప్రజలందరికి అమ్మవారి అశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అలయ అర్చకులు ఆయనకు అశీర్వాదాలు అందజేశారు. శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# విప్లవోద్యమ నేతలు డివి, విజయ్‌లకు ఘన నివాళులు



మాట్లాడుతున్న ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** పీడిత, తాడిత ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, తరిమెల నాగిరెడ్డి బాటలోనే విజయ్ పయనించారని వారి త్యాగాలు మరువలేనివని ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్, నవోదయ సాంస్కృతిక సంస్థ ప్రతినిధి డా.ఎన్.జతిన్‌కుమార్, భారత్–చైనా మిత్రమండలి జాతీయ ప్రధాన కార్యదర్శి డా.ఎం.మోహన్‌రెడ్డి చెప్పారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం(ఎంఎల్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన విప్లవోద్యమ అగ్రనేతలు డివి, టిఎన్, విజయ్ సంస్మరణ సభలో వారు ప్రసంగించారు. వారితోపాటు సభలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు వారి చిత్రపటాలకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినప్పటికి సామ్రాజ్యవాద,దళారీ పెట్టుబడిదారి, భూస్వామ్య వర్గాల అర్థవలస, అర్థ ఫ్యూడల్ వ్యవస్థ కొనసాగుతున్నదని, ఈ సుదీర్ఘకాలంలో రూపాలు మారినప్పటికి భూస్వామ్య విధానం పట్టు పెరిగిందే కాని తరగలేదన్నారు. దున్నుకోవడానికి భూమిలేక, సరైన ఉపాధి లేక గ్రామీణ పేదలు ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారని, సరైన పారిశ్రామిక అభివృద్ధి లేక దేశమంతా నిరుద్యోగం తాండవిస్తున్నదని, అదుపు లేకుండా పెరుగుతున్న ధరలు సామాన్య ప్రజల జీవనస్థాయిని ఆదేవనిగా హరించి వేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డివి, టిఎన్‌ల సిద్ధాంతాల వెలుగులో ఎదుర్కొని విప్లవ కార్యచరణను రూపొందించుకుని ధృఢంగా నిలిచింది, విప్లవ ప్రజాపంథాను అనుసరించి ప్రజలను సంఘటిత పరుస్తూ ప్రజా ఉద్యమాలను నిర్మిస్తున్నది ఈ పార్టీ అని వివరించారు. ఈ సభకు వి.ఎస్.వినోద్ కుమార్ అధ్యక్షత వహించగా సభలో విజయేంద్ర రావు, జి.వెంకటాద్రి, గ్రామీణ పేదల సంఘం నాయకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## బిఎల్ఎలు అప్రమత్తంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

**కెపిహెచ్‌బికాలనీ, జూలై 12, ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి నియోజక వర్గం ఉమ్మడి ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావు ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లు, ముఖ్యనాయకులతో ఆదివారం విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి ఇంచార్జ్ మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదయ్యేలా బిఎల్ఎల అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఒక్క అర్హుడైన ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు,నాయకులు దోసల అనిల్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు చేపూరి రాజు



అభివాదం చేస్తున్న అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నదని అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చేపూరి రాజు ఆరోపించారు. పార్టీ 28వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఘనంగా జరిగాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడిచినప్పటికి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిల స్థితిగతులు మారలేదని, పేదరికంలోనే ప్రజలు మగ్గిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో, రాష్ట్రంలో రాజకీయ నాయకుల అవినీతి రోజురోజుకు పెరిగిపోతున్నదని, బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకోవడం తప్పా ప్రజల గుర్తించి ఆలోచించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థులకు ప్రభుత్వం ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాట మాడుతున్నదని, అర్హులైన వారందరికి డబుల్ బెడ్‌రూంలు పంపిణిచేయాలని, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సురేందర్, తలారి రత్నం, అర్జున్, వెంకటేష్, బాలయ్య, ఎల్లయ్య, శివ, షేక్ మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల వివరాలను అన్‌లైన్‌లో పెట్టాలి

### సర్వోదయ మండలి అధ్యక్షుడు శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని భూదాన్ భూముల పరిరక్షణకు ప్రత్యేకంగా కార్యాచరణను చేపట్టి జిల్లా, రెవిన్యూ డివిజన్, మండలం, గ్రామం సర్వే నెంబర్లు, విస్తీర్ణం, హద్దులు, ప్రస్తుత స్థితి, జియో-ట్యాగింగ్ తదితర వివరాలను నమోదు చేసి డిజిటలైజ్ చేసి అన్‌లైన్‌లో పెట్టాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పై వివరాలను తెలంగాణ ఆన్‌లైన్ భూ రికార్డుల్లో ప్రత్యేక భూ దాన్ కేటగిరిగా నమోదు చేస్తే అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమణలను సమర్థవంతంగా అడ్డుకోవచ్చునని సూచించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో భూదాన్ భూములపై సమగ్రంగా సర్వే నిర్వహించాలని , ప్రస్తుతం అనేక భూదాన్‌భూములు ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, అక్రమ లావాదేవీలు అసంపూర్ణ రెవిన్యూ రికార్డులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపధ్యంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆర్డిఓలు, తాహసిల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారులు, గ్రామ రెవిన్యూ సిబ్బంది భాగస్వామ్యంతో సమగ్ర సర్వేని చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూదాన్ యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి అర్హులైన వారందరికి భూదాన్ భూములను పంపిణి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండలి నాయకులు సాంబ మల్లేశం, దాసరి మల్లేష్, వి.బాలునాయక్, కొండలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

### -పూజలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**అత్తాపూర్ జూలై 12,ప్రభాతవార్త :** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పద్మశాలిపురంలో పోచమ్మ దేవాలయ నూతన శిలామయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఆదివారం ఈ వేడుకలను ఆలయ కమిటీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరై అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్ గౌడ్ , స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

**ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాలను పంపిణీ**

ఎస్ఐఆర్ ప్రక్రియ లో భాగంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పద్మశాలి పురంలో బిఎల్ఓలతో కలిసి ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రతీఓటరకు విధిగా ఎస్ఐఆర్ పత్రాలు పంపిణీ చేయాలని క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు అలాగే ఓటర్లకు కూడా ప్రతి ఒక్కరు పారం నింపి దగ్గరలో ఉన్న బిఎల్ఓ కు అందజేయాలని ఇది చాలా అత్యంత ముఖ్యమైన ప్రక్రియ కాబట్టి ప్రతి ఓటరు విధిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు.

## జీఎస్టీ వివాదాలను త్వరగా పరిష్కరించాలి

### సుశీల్‌కుమార్ శర్మ

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జీఎస్టీ సంబంధిత వివాదాలను త్వరగా పరిష్కరించడానికి చార్టర్డ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ న్యాయవాదులు తోడ్పాడాలని, జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ ఉపాధ్యక్షుడు న్యాయమూర్తి సుశీల్‌కుమార్‌శర్మ సూచించారు. బషీర్‌బాగ్‌లోని జీఎస్టీ భవన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అవధేశ్‌ప్రసాద్ దహిమా, కార్యదర్శి పి.వి.నారాయణరావు, మాజీ అధ్యక్షుడు సిఎ వేముల చంద్రశేఖర్, సిఎ హితేష్‌జైన్ తదితరులు జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ ఉపాధ్యక్షుడు, న్యాయమూర్తి సుశీల్‌కుమార్‌శర్మ, న్యాయ సభ్యుడు ఎపి రవి, సాంకేతిక సభ్యుడు డా.డి.కె.శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అసోసియేషన్ తాజాగా ప్రచురించిన మెంబర్స్ డైరెక్టరీ-2026, వార్షిక నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ భారతదేశ జాతి నిర్మాణాన్ని ముందుకు నడిపిస్తున్న జీఎస్టీలో పన్ను న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు అధీకృత ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

# కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి

### ఒయు రిజిస్ట్రార్ ప్రొ. నరేష్‌రెడ్డి



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఒయు రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి, అవంతి శ్రీనివాసరావు

**హైదరాబాద్, జూలై 12(ప్రభాతవార్త):** మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జె. నరేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాచిగూడ అంజయ్య హాల్‌లో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం "స్మృతి 2కె ఈకె కే 26 జరిగింది. దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై, పాత జ్ఞాపకాలను, అనుభవాలను పంచుకున్నారు. నరేష్‌రెడ్డి మాట్లాడుతూ అవంతి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు 35 ఏళ్లుగా నిరంతరం కష్టపడుతూ, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. నేటి విద్యార్థులు కేవలం ఉత్తీర్ణత మార్కులకే పరిమితం కాకుండా, మారుతున్న సాంకేతిక కాలానికి అనుగుణంగా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం తప్పనిసరి అని ఆయన సూచించారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంస్థల్లో చదివిన విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా అద్భుతంగా రాణిస్తూ సంస్థ కీర్తిప్రతిష్టలను పెంచడం గర్వకారణంగా ఉందన్నారు. గతంలో ఒక వేదికపై సినీ నటుడు చిరంజీవి సైతం అవంతి విద్యార్థుల క్రమశిక్షణను ప్రత్యేకంగా అభినందించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక మాట్లాడుతూ అవంతి విద్యాసంస్థల్లో ఎంతోమంది పేదకుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలను సాధించారని తెలిపారు. పూర్వవిద్యార్థులు తరచూ కళాశాలను సందర్శిస్తూ, ప్రస్తుత విద్యార్థులకు సరైన కెరీర్ మార్గదర్శకత్వం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓయూ కంప్యూటర్ సైన్స్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎం.ఎ.హమీద్, ఓయూ కామర్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇంద్రకాంతి శేఖర్, అసోసియేట్ ఎంగేజ్మెంట్ సీనియర్ డైరెక్టర్ సూరంపూడి సోనియా శ్రీకాంత్, క్రిసాల్ సోలార్ ఇన్ఫ్రా ఎండీ జక్కుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.ఇన్‌చార్జ్ డా. వేణుగోపాల్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, ప్రిన్సిపల్స్, ప్రొఫెసర్ ఎస్. అప్పారావు, డాక్టర్ స్వాతి, అధ్యాపక బృందం, వందలాది మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆదివారం వసంత్‌నగర్ డివిజన్ పరిధిలోని మాకినేని వినోద్ ఆధ్వర్యంలో డ్రీమ్ వ్యాలీ కాలనీలో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎన్నో సంవత్సరాలుగా ప్రధాన డ్రైనేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని, అనేక ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లులేక ప్రజలు రాత్రి వేళల్లో అసౌకర్యానికి గురవుతున్నారని, అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రయాణానికి అనుకూలంగా లేవని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. బండి రమేష్ మాట్లాడుతూ ప్రధాన డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు సంబం ధిత అధికారులతో సమన్వయం చేసి వెంటనే చర్యలు చేపడతామని, అవసరమైన చోట్ల స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించి, దెబ్బతిన్న రోడ్ల నిర్మాణ పనులు కూడా త్వరితగతిన ప్రారంభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే డ్రీమ్ వ్యాలీ కాలనీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తాను అన్నారు.సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేవరకు కాలనీని విడిచిపెట్టననీ అవసరమైతే మళ్లీ పాదయాత్ర నిర్వహించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని బండి రమేష్ పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా నాయకుడిగా సేవలు అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. డ్రీమ్ వ్యాలీ కాలనీలో నిర్వహించిన ఈ పాదయాత్రకు తూము వేణు, శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ, కొప్పిశెట్టి దినేష్ కుమార్, రంగ మోహన్, గోపాల్ చౌదరి, చావా శ్రీనివాస్, శివ చౌదరి, సాయిబాబా చౌదరి, సంధ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రినగర్‌లో ఉచిత వైద్యశిబిరం

**యూసుఫ్‌గూడ, జూలై, 12 ప్రభాతవార్త :** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు దోహద పడతాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరావు అన్నారు. ఆదివారం గాయిత్రినగర్ డివిజన్ పరిధిలో తులసీనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. తులసీనగర్ సంక్షేమ సంఘం మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో పెద్ద ఎత్తున స్థానికంగా ప్రజలు పాల్గొని వివిధ వైద్య పరీక్షలను నిర్వహించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్ తులసీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు అంకిత్ సింగ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు విజయ్, పాండు యాదవ్, హరికృష్ణ, చింటు, కిషోర్, కృష్ణా, వేణుగోపాల్, శ్రీశైలం, సురేందర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి డివిజన్‌లో సర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్ 249 పరిధిలోని సంగీత్‌నగర్‌లో ఆదివారం సర్ ప్రక్రియకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. బిజెపి సీనియర్ నాయకులువడ్డేపల్లి రాజేశ్వరరావు సౌజన్యంతో, చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు హెల్ప్ డెస్క్‌ను సందర్శించి సర్ ప్రక్రియకు సంబంధించి తమకు ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సందేహాలకు స్పష్టమైన వివరణలు అందిస్తూ, సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్ నిరంతరం కొనసాగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సర్ లీగల్ సెల్ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి డివిజన్ కోఆర్డినేటర్ చేదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్, వినయ్, 3వ బూత్ అధ్యక్షులు రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, దుర్గారావు, మంజునాథ్ దినేష్, కృష్ణప్రియ, సంతోష్, రామకృష్ణచారి, కొమ్ము ప్రభాకర్ పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి : గజ్జెల నాగేష్

**బేగంపేట జూలై 12,ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ గజ్జెల నాగేష్ అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ఒక్క ఓటు కూడా పోకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి,నాయకులు శ్రీహరి,నాగు రఘునాథ్,నరేష్ ,సురేష్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ సమస్యల పరిష్కారమే ధ్యేయం

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థసారథి

**చిక్కడపల్లి, జూలై 12 (ప్రభాతవార్త):** బాగ్‌లింగంపల్లి డివిజన్ శ్రీరామ్‌నగర్ కమాన్ బస్తీ సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని, బస్తీ అభివృద్ధికి సహకరిస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థసారథి స్పష్టంచేశారు. ఆదివారం నూతనంగా ఏర్పాటైన బస్తీ నూతన కమిటీ సన్మాన కార్యక్రమం,అన్నదాన కార్యక్రమాన్ని పార్థసారథి ప్రారంభించి మాట్లాడారు. 9 నెలలుగా ఇక్కడి నూతన పైప్‌లైన్ పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం నాదృష్టికి వచ్చింది. దీనిపై జలమండలి జీఎం, డీజీఎం, మరియు మేనేజర్ జ్యోతిలతో మాట్లాడటం జరిగిందన్నారు. 10 రోజుల్లో పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని అన్నారు. నిలిచిపోయిన పనుల నిమిత్తం జలమండలి అధికారులు ఇప్పటికే కొత్త కాంట్రాక్టర్‌ను నియమించారని రాబోయే 10 రోజుల్లోనే పైప్‌లైన్ పనులను తిరిగి ప్రారంభించి, పూర్తి చేస్తామని డీజీఎం హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన బస్తీ కమిటీ అధ్యక్షుడు సురేష్‌కు, సభ్యులకు నా అభినందనలు. బస్తీ ప్రజలకు సమన్వయం చేసుకుంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కమిటీ బాధ్యతాయుతంగా పనిచేయాలి. బస్తీ అభివృద్ధి కోసం చేసే ప్రతి పనిలో నేను ముందుంటానని హామీ ఇచ్చారు. బీజేపీ నేతలు హర్ష, కర్ణం బాబు, మాధవ్ రెడ్డి, జట్కార్ శ్రీను, బబ్లూ పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

**బేగంపేట జూలై 12,ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రకాశంనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్గ కరుణాకర్ సూచించారు. కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,రాష్ట్ర కమ్మ కార్పోరేషన్ చైర్మన్ బండి రమేష్ సూచనల మేరకు ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రకాశం నగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దర్గ కరుణాకర్ పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడం ప్రతి బీఎల్ఏ,కాంగ్రెస్ పార్టీ శ్రేణుల బాధ్యత అని అన్నారు. ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ పెద్దలు సూచించిన పనులను విజయ వంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు చినబాబు, శాంతి, అరుణ్‌గౌడ్, నరేందర్, సృజిత్‌గౌడ్, సురేష్ బాబు, మైనార్టీ అధ్యక్షులు పర్వేజ్, మోహిత్, పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఖాజాగూడ వాసులు

## హైకోర్టు స్టే ఉండగా పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసం

**గచ్చిబౌలి, జూలై 12 ప్రభాతవార్త :** హైడ్రా తీరు తమకు అన్యాయం చేసే విధంగా ఉందని, హైకోర్టు స్టేఉండగా ఖాజాగూడ సర్వే నెంబరు 17లో పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఖాజాగూడవాసులు వాపోయారు. ఆదివారం ఖాజాగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దగోని అంతయ్య వారసులైన ధనుంజయ్‌గౌడ్, రవికుమార్‌గౌడ్, నరేందర్, శంకర్‌గౌడ్, జయరామ్, శ్రీకాంత్, కాటంరాజు తదితరులు మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండలపరిధిలోని ఖాజాగూడ సర్వేనెంబరు 17లోఉన్న భూమి తౌటోని కుంట అంటూ హైడ్రా రెండు రోజుల క్రితం పాక్షిక నిర్మాణాలను కూల్చివేసిందన్నారు. అనంతరం సదరు భూమిలో అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. కానీ సర్వే నెంబరు 17లో ఉన్న భూమి తమ పట్టా స్థలమని, ఈ విషయమై కొన్నేళ్లుగా కోర్టులో పోరాడుతున్నామని తెలిపారు. పురాతన ఖాస్రా పహణీలలో సర్వే నెంబరు 117/3/16 పేరుతో 4.02 ఎకరాల భూమి తమ తండ్రి పేరుతో పట్టా ఉందన్నారు. అనంతరం వచ్చిన సేత్వార్ పట్టాలో ఈ భూమిని సర్వే నెంబరు 17తో పక్కనే ఉన్న 1.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కలిపి మొత్తం 5.18 ఎకరాలను ప్రభుత్వ భూమిగా సూచించారని అన్నారు. ఈ విషయమై గతకొన్నేళ్లుగా తాము కోర్టులో పోరాడుతున్నామని అన్నారు. కాగా కొన్నిరోజుల క్రితం హైడ్రా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సర్వే నెంబరు 17లో కూల్చివేతలు చేపట్టారని, తౌటోనికుంట స్థలం అంటూ అభివృద్ధి పనులు చేపట్టసాగారని వాపోయారు. ఈ విషయమై తాము హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టేటస్ కో ఇచ్చిందన్నారు. కానీ హైడ్రా అధికారులు కోర్టు తీర్పును సైతం పాటించకుండా పనులు కొనసాగిస్తున్నారని వాపోయారు. ఈ విషయమై అధికారులు వెంటనే జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు

**చిక్కడపల్లి జూలై 12 (ప్రభాతవార్త) :** చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై భాగ్యనగర ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన ఖిలంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో "హలో హైదరాబాద్" పేరిట ఈ వేడుకలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పలు ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అన్ని వయసుల వారైన 300 మందికి పైగా కళాకారులు పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను కనువిందు చేశారు. కార్యక్రమానికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల నేటి తరానికి మన కళలు, సాహిత్యంపై ఆసక్తి తగ్గిందని భావిస్తామని, కానీ ఇక్కడి బాల, యువ కళాకారుల అద్భుత ప్రదర్శనలు చూశాక ఆ మాటల్లో కొంత మాత్రమే వాస్తవం ఉందని అర్థమవుతోందన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరమే విజయవంతంగా ముందుకు తీసుకెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ స్థాపకుడు అశోక్ లాస్య నక్క అందరికీ స్వాగతం పలుకుతూ.. తమ అకాడమీ గత కొన్ని ఏళ్లుగా దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ వస్తోందని తెలిపారు. విఖ్యాత ఆంధ్రనాట్య గురువు డాక్టర్ నటరాజ రామకృష్ణ స్మృత్యర్థం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ, జర్నలిస్ట్ సుమన్, గాయకుడు ప్రణయ్‌కుమార్, అశ్వని, అయేషా తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

## దర్గాలో ప్రార్థనలు

**బేగంపేట జులై 12,ప్రభాతవార్త :** నల్లగుట్ట ఎఫ్ లేన్ కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న గౌసియా పక్కా చిల్లా దర్గాలో ఆదివారం గ్యార్వీ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనలు రాంగోపాల్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు త్రికాల మనోజ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈ ప్రార్థనల్లో బలవంతు, సంజయ్‌సింగ్, రాజ్‌కుమార్, హర్షిత్, సందీప్ ఉన్నారు.

## సర్‌లో సాయానికి సహాయ కేంద్రాలు

**జూబ్లీహిల్స్, జూలై 12, ప్రభాతవార్త :** మరో 12 రోజుల్లో సర్ పత్రాల అందజేత ప్రక్రియకు గడువు ముగుస్తుండటంతో ఆదివారం ఈ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో రాజకీయ పార్టీలు సహాయ కేంద్రాలను ఏర్పాటుచేసి ఓటరు సవరణ ప్రక్రియకు సంబంధించి ప్రజలకు సాయాన్ని అందిస్తున్నారు. ఫిల్మ్‌నగర్‌లోని గౌతం నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ డివిజన్ నేత ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ, కళ్యాణ్‌నగర్ వెంచర్-3, కళ్యాణ్‌నగర్ పార్కు వద్ద ఏర్పాటుచేసిన సహాయ కేంద్రాలను ఎమ్మెల్యే వల్లాల నవీన్‌యాదవ్ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పత్రాలను పూర్తి చేసి అందించాలన్నారు. ఖైరతాబాద్ డివిజన్‌లోని వెంకటరమణ కాలనీ, గాంధీ తాతనగర్, రామకృష్ణనగర్, బాలాపూర్ బస్తీలలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రాలను మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి పరిశీలించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి నా ఓటు- నా బాధ్యత అనే సందేశాన్ని వివరించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలుప్రాంతాల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మాంటి సునీతాగోపీనాథ్ సర్‌లో పాల్గొన్నారు.

## మధురానుభూతిని కలిగించి సినీసంగీత విభావరి



ఆర్టిస్ట్ జానకిని సన్మానిస్తున్న అతిథులు, గాయనీగాయకులు

**నాంపల్లి, జూలై 12 ప్రభాతవార్త :** ప్రఖ్యాత లెజెండ్ గాయకులు ఘంటసాల, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జానకి ఆలపించిన ఆణిముత్యాల్లాంటి సినీగీతాల సినీసంగీత విభావరి విచ్చేసిన అశేష ప్రేక్షకులకు, ఔత్సాహిక సంగీతప్రియులకు మధురానుభూతిని కలిగించాయి. ఎస్ఎస్ఎస్‌కె మెలోడీస్ నూతన సాంస్కృతిక సంస్థ ఆవిర్భావ శుభసందర్భంగా నిర్వహించిన ఈ విభావరిలో వర్ధమాన గాయనీ గాయకుల సుమధుర గళాల నుండి జాలువారిన గేయాలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుని ఉర్రూతలూగించాయి. సంస్థ అధినేత్రి సుగురు జానకి నేతృత్వంలో గాయకుల బృందం ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జానకి, పి.సుశీలలు పాడిన ఆధ్యాత్మిక, సామాజిక, జానపద,సందేశాత్మక, దేశభక్తి తదితర అన్నిరకాల జనరంజకమైన పాటలతో వీనులవిందు చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ అతిథులు న్యూస్‌రీడర్ మహ్మద్ షాబుద్దీన్, కె.వి.కృష్ణమోహన్, టీవి కళాకారిణి సీత తదితరులు గాయనీ గాయకులను ఘనంగా సత్కరించి, నూతన సంస్థ స్థాపకురాలు సుగురు జానకిని శుభాభినందనలు తెలిపారు. ముమ్ముందు మంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అన్ని రకాల ప్రేక్షకులను రంజింపజేసి గొప్పసంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ప్రముఖనటి, డబ్బింగ్‌ఆర్టిస్ట్ జానకిని ఘనంగా సన్మానించారు.

## విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత

**గన్‌ఫౌండ్రి, జూలై 12ప్రభాతవార్త:** ఉన్నత విద్యకై మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎన్నో ఏళ్లుగా రెడ్డి జనసంఘం ఉపకార వేతనాలను అందించి ప్రోత్సాహిస్తుందని రెడ్డి జన సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రెడ్డి బాలుర వసతి గృహం ఆడిటోరియం 2026-2027 సంవత్సరానికి చెందిన మెడికల్,ఇజనీరింగ్,గ్రాడ్యుయేషన్ ఇతర కోర్సులలో మెరిట్ సాధించిన 254 మంది విద్యార్థులు, విద్యార్థినీలకు 20 లక్షల 85 వేల రూపాయల చెక్కుల రూపేణా పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం కార్యదర్శి పాండురంగారెడ్డి, ఉపాధ్యక్షురాలు అలుక సుకన్యారెడ్డి, కార్యదర్శి డాక్టర్ బి.మధుసూదన్‌రెడ్డి, సభ్యులు తీగల మోహన్‌రెడ్డి, సభ్యులు తీగల మోహన్‌రెడ్డి, ఎం.భారతి, జైపాల్‌రెడ్డిలతో కలిసి రాజాబహుదూర్ వెంకటరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులను అందచేశారు.ప్రతియేటా ఉన్నత విద్యకోసం గత ఏన్నోఏళ్లుగా ప్రతి ఏటా దాత సహకారంతో ఉపకార వేతనాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజా బహుదూర్ వెంకటరామిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటి ఉపాధ్యాయులు దాతలు పాల్గొన్నారు.

## క్లాత్ బ్యాగ్ వినియోగంపై అవగాహన

**యూసుఫ్‌గూడ, 12 జూలై, ప్రభాతవార్త :** ఎర్రగడ్డ రైతుబజార్‌లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హితమైన క్లాత్ బ్యాగ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి మల్టీ స్పెషాలిటీ హెల్త్‌క్యాంప్ జిల్లా చైర్మన్ డాక్టర్ చేకూరి హనుమంతునాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంవల్ల పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన హానికర ప్రభావాలు కలుగుతున్నాయన్నారు. రైతు బజార్‌కు వచ్చిన వినియోగదారులకు ఉచితంగా క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేసి ప్లాస్టిక్ సంచులకు బదులుగా వాటినే వినియోగించాలని సూచించారు. అనంతరం రైతుబజార్ ఎగ్జిక్యూటివ్ ఆఫీ సర్ రమేష్ మాట్లాడుతూ ప్రతి రోజు రైతులు, వినియోగ దారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమిత చైర్మన్ లయన్ అన్యం కోటి రెడ్డి, సూపర్‌వైజర్లు సతీష్‌కుమార్, ఏడుకొండలు, సునీత పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ జెండావిష్కరణ

**చార్మినార్, జూలై 12 ప్రభాతవార్త :** చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం హరిబౌలి డివిజన్ పరిధిలో ఆదివారం చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్,హైదరాబాద్ జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు మహేందర్ ముదిరాజ్,మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మనోజ్ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో టిఆర్ఎస్ పాలన వచ్చే వరకు పోరాడతామని తెలిపారు. యాకుత్‌పుర నియోజకవర్గం పరిశీలకులు కులకర్ణి,మీనా చౌహాన్, హరిబౌలి డివిజన్ అధ్యక్షులు ఫంకజ్ షిండే,యాకుత్‌పుర నియోజకవర్గం నాయకులు విజయ్ కుమార్,పురానాపూల్ డివిజన్ అధ్యక్షులు బాను గంగపుత్ర,వికాస్,సంతోష్,శారదతో పాటు పలువురు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
III rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE; AT :: MALKAJGIRI
O S .NO. 438 OF 2026.

Between:-
Smt. Dindu Bharathi and Others ....Plaintiff Nos.1 to 3
AND
The Tahsildar & Another ....Defendant Nos.1 & 2
To
All Concerned ....Defendant No.2

NOTICE TO WHOMSOEVER IT MAY CONCERNED

Please take notice that the above Suit is filed by the Plaintiffs for Declaration of title in respect of suit schedule property of Late Dindu Ramachandraiah Under Order - VII, Rule 1 of Civil Procedure Code in their favour, in respect of all that open plot bearing No. 1733 West part, admeasuring 232.22 Sq. Yards or 194.13 Sq. Mtrs., (out of 244.44 Sq. Yards), in Survey Nos. 388, 407, 408, Situated at Weaver's Colony, Bhavana Nagar of Dammaiguda Village and Municipality, Keesara Mandal, Medchal - Malkajgiri District and the same is posted to 29/07/2026 for your appearance in the above case and all concerned persons, if anybody, having any objection, interest, and claims to be raised before the court, are hereby informed through this notice to appear before the Hon'ble IIIrd Additional Junior Civil Judge, At: Malkajgiri/Kushaiguda either personally or through Advocate on **29/07/2026 AT 10:30 A.M.**, failing which the Hon'ble Court shall proceed further as per law.

SCHEDULE OF PROPERTY

All that open plot bearing No. 1733 West part, admeasuring 232.22 Sq. Yards or 194.13 Sq. Mtrs., (out of 244.44 Sq. Yards), in Survey Nos. 388, 407, 408, Situated at Weaver's Colony, Bhavana Nagar of Dammaiguda Village and Municipality, Keesara Mandal, Medchal - Malkajgiri District and bounded as follows :- **North** : 33' Wide Road, **South** : Plot No. 1728, **East** : Plot No. 1732, **West** : Plot No.1733

(By Order Of The Hon'ble Court)
M/s. S. VEERANDER, (TS/1704/2001)
T. NAGARJUNA, ADVOCATES
R/o. Dr. A S Rao Nagar, Hyderabad - 062
Mobile No: 9394004397

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE: R.R. DISTRICT: AT HAYATHNAGAR:
O.S.No. 449 of 2026

Between:
**Nomula Kalamma & others ...Plaintiffs**
And
**The Tahsildar, Abdhullapurmet & All Concerned ...Defendants**
To
**All concerned**

Please take notice that the Plaintiffs herein have jointly filed a suit for declaration to declare them as the legal heirs of late Nomula Bhupal S/o late Gandaiah vide O.S.No. 449/2026, on the file of the Hon'ble Prl. Junior Civil Judge, R.R. District, at Hayathnagar and the same is posted on **24-7-2026** for the objections if any. As such, any person or persons have any sort of objection in respect of said claim of the Plaintiffs may approach the Hon'ble Court at 10-30 A.M., on the above said date, otherwise, the Hon'ble Court will pass appropriate orders based on the materials available on record.

//BY ORDER OF COURT//
**M/S. MIRYALA JAGAN**
**S. NAGARAJU**
**ADVOCATES**
IBRAHIMPATAN,
R.R. DISTRICT.

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE 1st ADDL JUNIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT AT : MEDCHAL.
O.S.NO. 422 OF 2026

Between:
**IMMANENI NAGABHUSHANAM**
S/o Shobhanadri Rao Immaneni aged about 78 yrs, Occu: Retired R/o Flat No. 03, Plot No. 108, 109, 110, Vasumathi Nilayam, Lahari Enclave-2, Ushodaya Colony, Gajularamaram, Medchal Malkajgiri District- 500055 **...Plaintiffs**
AND
**1. Tahasildar/Mandal Revenue Officer** (M.R.O), Quthbullapur Mandal Medchal- Malkajgiri District
**2. All Concerned ...Defendants**
To
**D2) All Concerned**

Please take notice that the Plaintiff has filed the above case to claim the Legal Heir status of legal heir of the deceased Late IMMANENI SIVA KUMARI w/o IMMANENI NAGA BHUSHANAM on the file of the **HON'BLE 1st ADDL JUNIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT AT : MEDCHAL** and the same is posted to **12-08-2026 at 10.30 AM** for your appearance before the aforesaid court either in person or along with your Advocate to raise objections if any failing which the Court shall pass appropriate orders in your absence according to Law.

(By Order of the Court)
**K W J BOSE**
**Advocate,**
# (21-205), Road No.9, West Venkatapuram, Secunderabad-500 015,
**9440475569**
**kwjbose@gmail.com**

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, At: Medchal
O.S.No. 389 of 2026

Between:
**Mohd. Abdul Aziz and others ....Plaintiffs**
And
**1. The Tahsildar / MRO, Quthbullapur Mandal,**
**2. All Concerned ....Defendants**
To,
**All concerned.**

Please take notice that the above named plaintiffs herein filed the above said suit for declaration to declare them that they are only legal heirs of late Saleema Begum W/o. Md. Abdul Aziz who died on 02.05.2002 and the above said suit is posted to **20.07.2026** as such the person or persons who are interested the above said matter then they may approach the above said Hon'ble court either in person or through advocate on **20.07.2026 at 10.30 A.M.** failing which the matter will be heard and disposed in accordance with the law.

(BY THE ORDER OF THE COURT)
**Sd/- M/s. J. Rama Krishna**
**A. Hussain, Paramjith Singh,**
**Pinki Jha, M. Nagasahith**
**Advocate,**
H.No.48-19, Rami Reddy Nagar, Quthbullapur Municipal Circle and Mandal, GHMC, Medchal-Malkajgiri District.
**Ph: 9440168144, 8519868154.**

# ఏడుపాయలలో పోటెత్తిన భక్తజనం...

- మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు..
- బోనాలు, ఒడిబియ్యం, తలనీలాలతో అమ్మవారికి మొక్కుల చెల్లింపు..
- ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన వనదుర్గ భవాని క్షేత్రం...
- పోలీసుల ప్రత్యేక బందోబస్తు...



భక్తులకు దర్శనమిస్తున్న వనదుర్గమాత



ఏడుపాయలలో భక్తుల రద్దీ

**పాపన్నపేట, జులై 12, ప్రభాతవార్త:**
భక్తుల కోర్కెలు తీర్చే ఇలవేల్పు దేవతగా ప్రసిద్ధి చెందిన ఏడుపాయల శ్రీ వనదుర్గ భవాని ఆలయం ఆదివారంభక్తజనసందోహంతో కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో తెలంగాణ నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనార్థం భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు తెల్లవారుజాము నుంచే ఆధ్యాత్మిక సందడితో కళకళలాడాయి. భక్తులు ముందుగా మంజీరా నదిలోని పవిత్ర ఏడు పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన భక్తులు బోనాలు సమర్పించడం, ఒడిబియ్యం పోయడం, కుంకుమార్చనలు చేయించడం, తలనీలాలు సమర్పించడం ద్వారా తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా "జై దుర్గమ్మ" నినాదాలు, భక్తిగీతాలతో మారుమోగి భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది సూర్య, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, బ్రహ్మచారి, బత్తిని రాజు, నర్సింలు, వరుణాచారి, యాదగిరి, మహేష్, నరేష్, దీపక్ తదితరులు దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

వేదపండితులు శంకర శర్మ, పార్థివ శర్మ, రాము, శేఖర్, నాగరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆలయ ప్రాంగణం, మంజీరా పాయలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రశాంతంగా దర్శనాలు కొనసాగేలా చర్యలు చేపట్టారు.

# రామచంద్రాపురంలో సినీ నటి రాశీఖన్నా సందడి

-మాంగళ్య షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన రాశీ ఖన్నా



రామచంద్రాపురంలో మాంగళ్య షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి రాశీఖన్నా

**రామచంద్రాపురం, జులై 12, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్‌ను ఆదివారం టాలీవుడ్ సినీ నటి రాశీఖన్నా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామచంద్రాపురంలోని మాంగళ్య షాపింగ్ మాల్‌ను రాశీఖన్నా ప్రారంభించేందుకు వస్తున్నారన్న సమాచారం ముందస్తుగా ఉండటంతో నటిని చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు, సినీ ప్రేమికులు తరలిరావడంతో షాపింగ్ మాల్ ప్రాంతం సందడిగా మారింది. షాపింగ్ మాల్ ప్రారంభించేందుకు వచ్చిన సినీ నటి రాశీ ఖన్నాను షాపింగ్ మాల్ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. మాల్ ప్రారంభోత్సవానికి సినీ నటి రాశీఖన్నాతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ యాదవ్, రాజకీయ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాశీ ఖన్నా మాట్లాడుతూ రామచంద్రాపురం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మాంగళ్య 30వ షోరూంను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఒకే చోట అన్ని రకాల ఆధునిక వస్త్ర శ్రేణిని అందుబాటులోకి తీసుకురావడం అభినందయమని కొనియాడారు. మాంగళ్య ప్రొప్రైటర్ కాసం నమ:శివయా మాట్లాడుతూ రామచంద్రాపురం పరిసరర ప్రాంత ప్రజల నమ్మకం వమ్ముకాకుండా అన్ని వర్గాల వారికిఅన్ని పండగలు, శుభకార్యాలకు సరిపోయే సరికొత్త కలెక్షన్‌ను హోల్‌సేట్ ధరలకే అందిస్తామన్నారు. వంద రూపాయల నుంచి 4లక్షల ఖరీదైన వస్త్రాలు తమ వద్ద విక్రయిస్తామన్నారు.

# జాతీయ స్థాయి లైఫ్ టైం అచీవ్మెంట్ పురస్కారానికి రామకృష్ణ ఎంపిక...

**సదాశివపేట, జులై 12, ప్రభాతవార్త:** నెల19న హైదరాబాద్ రవీంద్రభారతి లో, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే జాతీయ విద్యావేత్తల విశిష్ట పురస్కారాలు 2026 లో భాగంగా సదాశివపేట మండలం లోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ లైఫ్ టైం అచీవ్మెంట్ పురస్కారానికి ఎంపికయినట్లు చైర్మన్ పట్నం.కమలాకర్ ఒక ప్రకటన లో తెలియ జేశారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో, ముఖ్య అతిథి రాజ్యసభ యంపి వద్దిరాజు రవిచంద్ర మరియు ప్రత్యేక అతిథి, చలన చిత్ర నటుడు పృధ్విరాజ్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకుంటారని చైర్మన్ కమలాకర్ తెలియజేసారు.

విద్యా, సామాజిక, పర్యావరణ రంగాలలో విశిష్ట సేవలకు గాను ఈ పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ పురస్కారానికి తనను ఎంపిక పట్ల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియ జేశారు.

# ఎస్ఐ నర్సింలును సన్మానించిన పూర్వ విద్యార్థులు

**గజ్వేల్ టౌన్, జులై 12, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారం గ్రామంలో గల నర్సింహారెడ్డి ఫాంహౌజ్‌లో 1984-85 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తోటి మిత్రుడు పంపరి నర్సింలు సిద్దిపేట వన్‌టౌన్ ఎస్ఐగా పదోన్నతి పొందగా వారిని శాలువా, మెమొంటో, బహుమతితో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్యాసారం నర్సింహారెడ్డి, పోగుల సోమేష్, మాయహరన్, రమణారావు, రామ్‌నర్సయ్య, సాయిరాం, ఆరిఫ్, పోగుల వెంకటేష్, ఎలమంచి శ్రీనివాస్, డి.లక్ష్మణ్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ నర్సింలును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

# పీర్ల జాతరకు సీకేజి యువసేన చేయూత

రూ.10 వేల విరాళం అందజేసిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

కులమత సామరస్యానికి పీర్ల జాతర నిదర్శనమని వ్యాఖ్య

**గుమ్మడిదల, జులై 12, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న పీర్ల జాతరకు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ఆధ్వర్యంలోని సీకేజీ యువసేన సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని జాతర కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ, పీర్ల జాతరలు కులమత భేదాలకు అతీతంగా ప్రజలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చే సామరస్య వేదికలని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారం, సోదరభావంతో పాల్గొని జాతరను విజయవంతం చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సీకేజీ యువసేన సభ్యులు, పీర్ల జాతర కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



జాతర నిర్వహిస్తున్న దృశ్యం

# అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు



మంత్రి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ సుల్తాన్

**మునిపల్లి, జులై 12 (ప్రభాతవార్త):**
10 సంవత్సరాల్లో పూర్తికాని పనులు రెండు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్ లో చేరినట్టు సోషల్ జస్టిస్, బిఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు డాక్టర్ సుల్తాన్ అన్నారు. ఆదివారం మునిపల్లి మండలం బుదేరాలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిపల్లి చౌరస్తా నుండి ఖమ్మంపల్లి వరకు బిటి రోడ్డు, తాటిపల్లి నుండి పెద్దలోడి, గార్లపల్లి, చిల్లపల్లి రోడ్డు పనులు, తక్కడపల్లి బ్రిడ్జి పనులు చాలా తక్కువ సమయంలోనే వేగవంతంగా పూర్తి చేస్తున్న దామోదర్ రాజనర్సింహ నాయకత్వానికి ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరినట్టు ఆయన తెలిపారు. అదేవిదంగా ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్ పథకం, రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, పలు రకాల అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరినట్టు ఆయన పేర్కొన్నారు. ఎఎంసి చైర్మన్ సుధాకర్ రెడ్డి, నాయకులు సతీష్, రాంరెడ్డి, బాబూపాటిల్, సతీష్, సంగమేశ్వర్, రసూల్ పటేల్, సర్పంచులు మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటిని సంరక్షించాలి... భూగర్భ జలాలను పెంచాలి

ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్

**నర్సాపూర్ ,జులై 12. ప్రభాతవార్త :**
నర్సాపూర్ పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరు విధిగా మీ యొక్క ఇంటి పరిసరాలలో ఆవరణలోఇంకుడు గుంతలు ఏర్పాటు చేసు కోవాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భ జల వనరులు పెరుగుతాయన్నారు. ప్రస్తుత వర్షాకాలం లో వర్షపాతం తక్కువగా నమోదు అవుతున్నందున, వర్షం ద్వారా పడిన ప్రతి నీటి బొట్టుని మరియు మనము వాడిన నీటిని ఇంకుడు గుంతల ద్వారా వడిసి పట్టినట్లయితే భూమిలో ఈ నీరంతా ఇనికిపోయి భూగర్భ జలాలు పెరిగి బోరుబావులో మంచినీరు పుష్కలంగా లభిస్తుందనీ తెలిపారు, తద్వారా భవిష్యత్ తరాలలో మంచినీటి సమస్య ఉండదనీ అన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం వలన లోతట్టు ప్రాంతాల ముంపు మరియు వరద తీవ్రత తగ్గుతుందన్నారు ప్రస్తుత కాంక్రీట్ ప్రపంచంలో మంచినీరు భూమిలో ఇనికే అవకాశాలు తక్కువగా ఉన్నందున కచ్చితంగా ప్రతి ఒక్కరు విధిగా, బాధ్యతగా భావించి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 200 చ. గజము కంటే ఎక్కువ విస్తీర్ణంలో భవనములు నిర్మించిన వారు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, లేనియెడల తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారము చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ప్రిన్సిపాళ్ల మధ్య కోల్డ్‌వార్

మొదటిపేజి తరువాయి

తెలుసుకున్న జోగిపేట సిఐ అనిల్‌కుమార్ పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకుని విద్యార్థులతో, ఇద్దరు ప్రిన్సిపాళ్లతో మాట్లాడారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన మండల విద్యాధికారి క్రిష్ణ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవటంతో పాటు ఇద్దరు ప్రిన్సిపాళ్ల మధ్య వైరానికి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే ముందుగా ప్రిన్సిపాళ్లతో చర్చించిన అనంతరం యదావిధిగా అదే భవనంలోకి మళ్లి విద్యార్థులను తిరిగి పంపించారు. అయితే వట్‌పల్లి పాఠశాల విద్యార్థులు మాత్రం తమకు సాధ్యమైనంత త్వరగా స్వంత భవనాన్ని సమకూర్చాలని, లేనిపక్షంలో మరేదైనా భవనంలోకి తమను మార్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# గీత కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలి




మాట్లాడుతున్న మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్

**హుస్నాబాద్ టౌన్, జులై 12, ప్రభాతవార్త:**
హుస్నాబాద్‌లో మోకు దెబ్బ ఆధ్వర్యంలో గౌడ జన హక్కుల పోరాట సమితి సమావేశం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని బీఎంకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం "గౌడ జన హక్కుల పోరాట సమితి" (మోకు దెబ్బ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పచ్చిమట్ల స్వామి గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద ఎక్స్‌గ్రేషియా, పెన్షన్, బీమా, అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టీసీఎస్, టీఎఫ్‌టీల లైసెన్సులను వెంటనే జారీ చేయడంతో పాటు, దరఖాస్తు చేసిన వారికి 30 రోజుల్లోగా లైసెన్సులు మంజూరు చేసే విధానాన్ని అమలు చేయాలని అన్నారు. లైసెన్సులు లేక తాటి చెట్లపై నుంచి పడి మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, బీమా, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 50 శాతం లైసెన్సులను గౌడ సమాజానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. జీవో నెం.560ను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని తాటి, ఈత, గిరక తాళ్ల అభివృద్ధికి కేటాయించాలని కోరారు. గీత కార్పొరేషన్ అభివృద్ధికి రూ.5,000 కోట్లు కేటాయించాలని, తాటి చెట్లు ఎక్కడానికి ఆధునిక భద్రతా పరికరాలు, పనిముట్లు ఉచితంగా అందించాలని అన్నారు. కల్లు సహజ ఆహార పానీయం కావడంతో దానిని ఎక్సైజ్ శాఖ పరిధి నుంచి తొలగించి ఫుడ్ అండ్ బెవరేజెస్ శాఖ పరిధిలోకి తీసుకురావాలని, గీత కార్మికులపై పోలీసు, ఎక్సైజ్ శాఖల వేధింపులను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నీరా పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించి గౌడ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు "సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లా"గా పేరు పెట్టాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంత గౌడులకు ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేసి వారి రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని, "మా జనాభా ఎంతైతే... మా వాటా అంతే" అనే సూత్రం ప్రకారం గౌడ సమాజానికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు అన్ని ప్రజాప్రతినిధి స్థానాల్లో సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

**నూతన జిల్లా కార్యవర్గం ఎంపిక....**

ఆదివారం జరిగిన ఈ సమావేశంలో మోకు దెబ్బ జిల్లా కార్యవర్గంలో పలువురు నాయకులను నియమించారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా కందుల శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా రాగుల పరుశరాములు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా చెరపల్లి లక్ష్మణమూర్తి, మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రంగగోని గంగారం గౌడ్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బూర వెంకన్న గౌడ్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాకాల శ్యాంసుందర్ గౌడ్, హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా పూదరి రవీందర్ గౌడ్, కోహెడ మండల అధ్యక్షుడిగా బబ్బురు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శిగా బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్, చిగురు మండల అధ్యక్షుడిగా కక్కెర్ల సంపత్ కుమార్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గడ్డం సమ్మయ్య గౌడ్లను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజు గౌడ్, జాతీయ కోశాధికారులు ఏవి జాలేశం గౌడ్, బాలసాని సురేష్ గౌడ్ (మాజీ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్), జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నరసింహులు గౌడ్, మహారాష్ట్ర ఇన్‌చార్జి కదిరే ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రచార కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, మండల స్థాయి గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు, గౌడ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 50 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి నేస్తాలు..




పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**కొండాపూర్, జులై 12, ప్రభాతవార్త:**
పాత జ్ఞాపకాలతో భావోద్వేగమైన 197576 ఓలీది బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగ స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ 2009లో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన ఆ రోజుల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డాను చెప్పుకోలేని అవమానాలు ఎదుర్కొన్నాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎలాంటి అక్రమాలకు, అవినీతికి పాల్పడకుండా జీవించాను నా వల్ల ఎవరికీ నష్టం జరగకూడదు.. ఎవరికీ కష్టం కలగకూడదనే ఆలోచనతో పనిచేశాను కాలం పరుగులు తీసింది. జీవితాలు మారాయి.. బాధ్యతలు పెరిగాయి.. ఎవరి దారిలో వారు సాగిపోయారు. కానీ 50 ఏళ్ల క్రితం పాఠశాల గదుల్లో చిగురించిన స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు. అర్ధ శతాబ్దం తర్వాత చిన్ననాటి నేస్తాలంతా ఆదివారం మల్కాపూర్ శివారులో ఒక్కచోట చేరడంతో ఆత్మీయత వెల్లివిరిసింది. సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 197576 ఓలీది బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం అపూర్వ జ్ఞాపకాలకు వేదికైంది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని తన పదో తరగతి సహచరులతో కలిసి బాల్య జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఎదురుపడిన నేస్తాలను చూడగానే ముఖాల్లో చిరునవ్వులు విరిశాయి. ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. ఎలా ఉన్నావురా అంటూ పలకరించుకుంటూ ఆనాటి పాఠశాల రోజులు, తరగతి గదుల్లో చేసిన అల్లరి, గురువుల మందలింపులు, కలిసి పంచుకున్న నవ్వులను గుర్తుచేసుకున్నారు. కొన్ని జ్ఞాపకాలు నవ్విస్తే.. మరికొన్ని కళ్లను చెమ్మగిల్లేలా చేశాయి. తమకు అక్షరాలు నేర్పి, జీవితానికి దారి చూపిన గురువులు సైతం సమావేశానికి హాజరుకావడంతో పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గురువులను ఆప్యాయంగా పలకరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. 50 ఏళ్ల నాటి మిత్రులందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు బ్యాచ్‌మేట్లు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఆత్మీయ కలయికలు మున్ముందు కూడా కొనసాగాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమానికి వచ్చిన చిన్ననాటి మిత్రులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శాలువాలతో సత్కరించి తన ఆత్మీయతను చాటుకున్నారు చాలా ఏళ్ల తర్వాత నా పదో తరగతి స్నేహితులందరినీ ఇలా ఒకే చోట చూడటం మాటల్లో చెప్పలేని ఆనందాన్ని ఇస్తోంది. చిన్నతనంలో ఎన్నో కష్టాలు చూశాం..ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాం. చూస్తుండగానే 50 ఏళ్లు గడిచిపోయాయి ఈ వయసులో కూడా మనమంతా సంతోషంగా కలుసుకోవడం నిజంగా మన అదృష్టం. దేవుడి దయ అని అన్నారు. మీలో ఎవరికైనా ఏ కష్టం వచ్చినా అది నా పరిధిలో పరిష్కరించగలిగేది అయితే తప్పకుండా అండగా ఉంటా మీకు సహాయం చేయడానికి ఎప్పుడూ ముందుంటా. నా రాజకీయ ప్రయాణంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానంటే అందులో మీ ప్రేమ, మీ కృషి, మీ ఆశీస్సులు మరువలేనివి అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎలాంటి అక్రమాలకు, అవినీతికి పాల్పడకుండా జీవించాను నా వల్ల ఎవరికీ నష్టం జరగకూడదు.. ఎవరికీ కష్టం కలగకూడదనే ఆలోచనతో పనిచేశాను ఈ రోజు నా చిన్ననాటి స్నేహితులైన మీ అందరి ముందు తలెత్తుకుని నిలబడేలా దేవుడు నాకు అవకాశం ఇచ్చాడు... అంతకంటే నాకు కావాల్సింది ఏముంటుంది అన్నారు తన భార్య సహకారం ఎంతో ఉందని చింత ప్రభాకర్ గుర్తుచేసుకున్నారు 2009లో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన ఆ రోజుల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డాను చెప్పుకోలేని అవమానాలు ఎదుర్కొన్నాను కానీ ప్రజల నిండు మనసు, వారి ప్రేమ, అండదండలే నన్ను నిలబెట్టాయి ప్రజల ఆశీస్సులతోనే ఎమ్మెల్యేగా గెలిచానుఅని

# పేదలకు పెద్దన్నగా సిఎం సహాయనిధి...

- ముగ్గురు లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్...
- మూడో వార్డులో బోరు మోటారు ప్రారంభం...

**పాపన్నపేట, జులై 12, ప్రభాతవార్త :** పేద ప్రజలకు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని కుర్తివాడ గ్రామ సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిరుపేదలకు వైద్య చికిత్సల కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం కుర్తివాడ గ్రామంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ముగ్గురు లబ్ధిదారులకు సర్పంచ్ శ్రీధర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని మూడో వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు మోటారును ఏర్పాటు చేస ప్రారంభించారు. దీంతో స్థానికులకు తాగునీటి ఇబ్బందులు తొలగి, నిరంతర నీటి సరఫరాఅందుబాటులోకి వస్తుందనితెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని పేర్కొన్న సర్పంచ్ శ్రీధర్, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజాప్రతి నిధులు, పార్టీనాయకులు, లబ్ధిదారులు, మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### మామిడ్యాలలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ

-సర్పంచ్ ఎడ్ల పోచయ్య

**ములుగు, జులై 12 (ప్రభాతవార్త):**
భారత ఎన్నికల సంఘం ఆదేశాలనుసారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను ములుగు మండలం మామిడ్యాల గ్రామంలో విజయవంతంగా కొనసాగుతుందని గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆవరణలో ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్లకు ఎలాంటి సమస్యలు ఉన్నా, సందేహాలు వచ్చినా పరిష్కరించడానికి బూత్ లెవల్ అధికారులు కేంద్రంలో అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నా, మార్పులు చేర్పులు ఉన్నా సంబంధిత అప్లికేషన్ ఫారాలను నింపి నేరుగా బూత్ లెవల్ అధికారులకు సమర్పించాలన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రక్రియ జరుగుతోందని, ప్రజలు హెల్ప్ డెస్క్‌ను ఉపయోగించుకొని తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణ, కార్యదర్శి రాజు, సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు అనిల్‌చారి, బిఎల్‌వోలు విజయ, నాగరాణి, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.